# కోతకు గురైన రోడ్డు..

● పట్టించుకోని అధికారులు
● ఆందోళన చెందుతున్న వాహనదారులు

ఖానాపురం: నిత్యం వాహనాల ప్రయాణం సాగించే రహదారి.. అటువైపుగా పర్యాటకానికి సైతం పర్యాటకులు అధికంగానే రాకపోకలు సాగిస్తుంటారు. ఆ రోడ్డు పక్కన ప్రమాదకర స్థాయిలో కోతకు గురై పెద్ద గుంత ఏర్పడింది. అయినా ఆ గుంతను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఏదైనా ప్రమాదం జరిగితే గానీ అధికారులు పట్టించుకోరా అని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నర్సంపేట నుంచి కొత్తగూడకు వెళ్లే ప్రధాన రహదారి మండలంలోని అశోక్‌నగర్ శివారులో పెద్ద గుంత ఏర్పడింది. రెండేళ్ల క్రితం భారీ వర్షాలతో పాకాల సరస్సు నిండుకుండలా మారి ఐదు ఫీట్లతో మత్తడి పోసింది. దీంతో పాకాల వాగు ఉధృతంగా ప్రవహించడంతో రోడ్డుపై నుంచి వరదనీరు భారీగా చేరి రోడ్డు కోతకు గురైంది. నిత్యం పాకాల పర్యాటక ప్రాంతానికి పర్యాటకులు, కొత్తగూడ మండలానికి వెళ్లే వాహనదారులు ప్రయాణాలు సాగిస్తుంటారు. రోడ్డు పక్కనే కోతకు గురై గుంత ఏర్పడి ప్రమాదకర స్థాయిలో ఉంది. అటువైపుగా జిల్లా ఉన్నతాధికారులు వచ్చినప్పటికి తమకేమీ పట్టింపులేకుండా వ్యవహరిస్తున్నారని గ్రామ ప్రజలతో పాటు వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళలో ప్రయాణాలు సాగించే వాహనదారులు ప్రమాదవశాత్తు అందులో పడి గాయపడిన సంఘటనలు ఉన్నాయని వాహనదారులు వాపోతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితేనే అధికారులు స్పందిస్తారా అంటూ ప్రజలు, వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గుంతను పూడ్చివేసి ప్రమాదాలను నివారించాలని కోరుతున్నారు.



అశోక్‌నగర్ శివారులో రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న గుంత

### తక్షణమే పూడ్చివేయాలి



రెండేళ్ల క్రితం రోడ్డుకోతకు గురై పెద్ద గుంత ఏర్పడింది. నాటి నుంచి గుంతను పూడ్చివేయించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. రాత్రి వేళలో ప్రయాణం చేయాలంటే భయపడుతున్నారు – ఎం.సాయిలు, అశోక్‌నగర్

# పెంచిన ధరలను ఉపసంహరించుకోవాలి

● సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు
● కట్టెల పొయ్యిపై వంట చేస్తూ నిరసన

నర్సంపేట : కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ బండపై రూ.50ని వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కోరబోయిన కుమారస్వామి, హన్మకొండ శ్రీధర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద బుధవారం కట్టెల పొయ్యితో వంట చేస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధర పెంచడం మూలంగా పేద, మధ్య తరగతి ప్రజలపై తీరని భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన గ్యాస్ ధరలు తగ్గించేంత వరకు సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు బాలకృష్ణ, రాజు, అనిల్, ఎండి.ఫరీదా, విజయ, స్వప్న, నాగమణి, నాయకులు జగన్నాథం, కార్తీక్, విలియం కేరి, బి.లక్ష్మి, యాకలక్ష్మి, వెంకన్న పాల్గొన్నారు.



కట్టెల పొయ్యిపై వంట చేస్తూ నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

# పోషణ్ అభియాన్ పక్కాగా అమలు చేయాలి



ప్రతిజ్ఞ చేపిస్తున్న సూపర్‌వైజర్ అరుణ

నల్లబెల్లి : పోషణ్ అభియాన్ కార్యక్రమాలను అంగన్‌వాడీ కేంద్రాల్లో పక్కాగా అమలు చేస్తూ తల్లీబిడ్డల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నల్లబెల్లి క్లస్టర్ సూపర్‌వైజర్ అరుణ అన్నారు. స్థానిక హరిజనవాడలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లతో కలిసి గర్భిణీలు, బాలింతల గృహాలను సందర్శించారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికా హారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. పోషక విలువలు కలిగిన ఆహారంపై అవగాహన కల్పించారు. ఎప్పటికప్పుడు పిల్లల బరువు, ఎత్తు చూసి తల్లిదండ్రులకు సమాచారం అందించాలన్నారు. అనంతరం ఈ మేరకు ప్రతిజ్ఞ చేశారు. ఏఎన్‌ఎం మాధవి, అంగన్‌వాడీ టీచర్లు , ఆశవర్కర్లు పాల్గొన్నారు.

# ఆరు గ్యారంటీలు అమలు చేయాలి

గీసుకొండ: ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీల సంక్షేమ పథకాలను సరిగా అమలు చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ డి.సురేశ్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ ఎఫ్‌ఏలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, రాజీవ్ యువవికాసం, ఉపాధి హామీ, తాగునీరు. పారిశుద్య పనులు సరిగా, సకాలంలో చేపట్టాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజుద్దీన్, ఎంపీడీఓ కృష్ణవేణి, ఎంపీఓ ఆడెపు ప్రభాకర్, కార్యాలయ సూపరింటెండెంట్ కమలాకర్, ఏపీఓ చంద్రకాంత్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ సురేశ్

## దాడి చేసిన వారిపై చర్య తీసుకోవాలి

నర్సంపేట : దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బాపునగర్‌కు చెందిన కొర్ర జమున వేడుకుంది. చెన్నారావుపేట పోలీస్‌స్టేషన్‌లో తనకు న్యాయం చేయాలని బుధవారం బాధితురాలు ఫిర్యాదు చేసింది. చెన్నారావుపేట మండలం బాపునగర్‌కు చెందిన జమునకు నెక్కొండ మండలం చర్లతండాకు చెందిన బానోతు రాజు రాజుతో ఏడాది క్రితం వివాహం జరిగింది. రెండు నెలల పాటు వీరి దాంపత్య జీవితం సాఫీగానే సాగింది. అనంతరం భర్త రాజు తరచూ వేధింపులకు గురి చేస్తున్నాడు. వేధింపులకు గురి చేయడంతో పాటు అదనపు కట్నం తేవాలంటూ ఇబ్బందులు పెడుతున్నాడు. దీంతో పలుమార్లు పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీలు నిర్వహించారు. బుధవారం సూరిపల్లిలో పంచాయితీ నిర్వహించుకుందామని పిలిపించి భర్త రాజు, మామ ఈర్య, చిన్నమామ జితేందర్, అత్త సరోజ, రామచందర్, పూల్య, బాలులు కలిసి పథకం ప్రకారం కర్రలతో దాడి చేసి తీవ్రంగా కొట్టారు. దీంతో జమున, అతని తండ్రి రవి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. భర్త, మామ, చిన్నమామ, అత్త సరోజ, రామచందర్, పూల్య, బాలులపై చర్య తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు జమున తెలిపింది.

# మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం

● ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట : గిరిజన గ్రామాల్లో మౌళిక సదుపాయాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని గురిజాల, కొండాపూర్, నర్సంపేట పట్టణం ద్వారకపేటలో 33/11కేవీ విద్యుత్ ఉప కేంద్రాలకు బుధవారం ఆయన శంకుస్థాపన చేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని మూడు గ్రామాల్లో రూ.7.5కోట్లతో నూతన విద్యుత్ ఉప కేంద్రాలకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ప్రతి గ్రామం, ప్రతి వాడలో ప్రతి ఒక్కరూ మీటర్లు తీసుకొని విద్యుత్ అధికారులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఉమారాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, విద్యుత్‌శాఖ అధికారులు, తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

**ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం**

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. చెన్నారావుపేట మండలంలోని అమీనాబాద్‌లో బుధవారం ఇందిరమ్మ లబ్ధిదారులకు చెందిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పదేళ్ల దుర్మార్గ పాలనలో గ్రామంలో ఒక్క డబుల్ బెడ్రూం ఇళ్లు కూడా నిర్మించలేదన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి నిర్మాణ పనులను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, పీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, పెండెం రామానంద్, మండల స్పెషల్ ఆఫీసర్ బాలకృష్ణ, తహసీల్దార్ ఫణికుమార్, ఎంపీడీఓ నల్ల శ్రీవాణి, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్, మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ సర్పంచ్ రమేష్, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు రమేష్‌యాదవ్, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, కాంగ్రెస్ యూత్ మండల అధ్యక్షుడు హరీష్, నర్సంపేట మార్కెట్ డైరెక్టర్ అశోక్, తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట : విద్యుత్ ఉపకేంద్రానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

**దైవ చింతనతోనే ప్రశాంతత**

నెక్కొండ : దైవ చింతనతోనే మానవాళి ప్రశాంతమైన జీవనం పొందుతారని స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మండలంలోని దీక్షకుంటలో బుధవారం జరిగిన ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, పెండెం రామానంద్, మార్కెట్ చైర్మన్లు హరీశ్‌రెడ్డి, శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు అశోక్, నాయకులు పాల్గొన్నారు.

# అక్రమాలపై విచారణ చేపట్టాలి

● తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఈర్ల పైడి

నర్సంపేట : ప్రభుత్వం రైతులకు ఇస్తున్న సబ్సిడీ యంత్ర పరికరాల విషయంలో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపించాలని తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఈర్ల పైడి డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొద్ది నెలల నుంచి ప్రభుత్వం రైతులకు సబ్సిడీ ద్వారా వ్యవసాయ యంత్ర పరికరాలను నియోజకవర్గంలో సుమారు రూ.75కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ యంత్ర పరికరాలను ప్రభుత్వం రైతులకు సబ్సిడీ ద్వారా అందజేస్తున్నారు. పరికరాలు, యంత్రాలను పంపిణీ చేయడానికి నర్సంపేట పట్టణంలోని సిరి ఆగ్రోస్ ఇంజనీరింగ్ వర్క్, మహేంద్ర ట్రాక్టర్ షోరూం, జాండిర్ ట్రాక్టర్ షోరూమ్ యాజమాన్యాలు వ్యవసాయ అధికారులతో ఒప్పందం చేసుకోవడం జరిగిందని ఆరోపించారు. కానీ యాజమాన్యాలు రైతులకు అందించే వ్యవసాయ పరికరాలలో కనీసం నాణ్యతలేని పరికరాలను తీసుకువస్తూ రైతులకు అంటగడుతున్నారన్నారు. అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న సిరి ఆగ్రోస్ ఇండస్ట్రీస్ ఇంజనీరింగ్, పాషా ఇంజనీరింగ్, మహేంద్ర, జాండిర్ ట్రాక్టర్ షోరూమ్‌లపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు ఆనంద్, భూమా అశోక్, శివరాత్రి కుమార్, చిన్న కుమారస్వామి పాల్గొన్నారు.



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ రైతు కూలీ సంఘం నాయకులు

# అకాల వర్షంతో తీరని నష్టం

ఖానాపురం: మండల వ్యాప్తంగా కురిసిన అకాల వర్షంతో అన్నదాతకు తీరని నష్టాన్ని మిగిల్చింది. చేతికందే సమయంలో వరిపంటలు నేలవాలడంతో పాటు రాలిపోవడంతో రైతులు కన్నీరు పెడుతున్నారు. మండల వ్యాప్తంగా వరి పంటలు నేలవాలగా, మిర్చి, మామిడి తోటలు కింద రాలిపోయాయి. పంటలను కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి తక్కళ్లపల్లి రవీందర్‌రావుతో ఏఓ శ్రీనివాస్, ఏఈఓ నాగరాణిలు పరిశీలించారు. నష్టపోయిన పంటలను అంచనా వేయించి ఎమ్మెల్యే మాధవరెడ్డి సహకారంతో పరిహారం అందించడానికి కృషి చేస్తామని డీసీసీ అధికార ప్రతినిధి రవీందర్‌రావు తెలిపారు.

**ఉద్యాన పంటలకు నష్టం**

పర్వతగిరి: మండలంలోని చింతనెక్కొండకు చెందిన నల్లపు వెంకట్రామనర్సయ్య రెండు ఎకరాల్లో సాగు చేసిన బొప్పాయి, పేరాల దేవేందర్ రెండు ఎకరాల్లో సాగు చేసిన అరటి పంట పూర్తిగా దెబ్బతిన్నది. అలాగే కరిమిల్ల సోమేశ్వరరావుకు చెందిన 11 ఎకరాల్లో మామిడితోట వడగళ్ల వానకు కాయలు రాలిపోయాయి. డివిజనల్ హార్టికల్చర్ అధికారి తరుణ్ నష్టపోయిన పంటలను బుధవారం సందర్శించారు. రైతులతో మాట్లాడి పంట నష్టం వివరాలు తెలుసుకుని పంట నష్టంపై సమగ్ర నివేదికను జిల్లా అధికారులకు పంపిస్తామని తెలిపారు.



పర్వతగిరి : చింతనెక్కొండలో వడగళ్ల వానకు రాలిన మామిడి కాయలు



నష్టపోయిన పంటను పరిశీలిస్తున్న రవీందర్‌రావు, అధికారులు

**పంట నష్టాన్ని పరిశీలించిన ఏఓ**

నల్లబెల్లి: ఈదురు గాలులతో నష్టపోయిన పంటలను ఏఓ రజిత బుధవారం పరిశీలించారు. మండలంలోని మేడపల్లి, నారక్కపేట, ఎర్రచెరువుతండా, గోవిందాపూర్, నల్లబెల్లి, గ్రామాల్లో నష్టపోయిన మక్కజొన్న, వరి పంటలను పరిశీలించారు. 70 ఎకరాల్లో మక్కజొన్న, 10 ఎకరాల్లో వరి నష్టపోయినట్లు గుర్తించినట్లు తెలిపారు.

## క్లుప్తంగా

### అత్యాచార నిరోధక కమిటీ సభ్యుడిగా సోమయ్య



వర్ధన్నపేట : మండలంలోని దమ్మన్నపేట గ్రామానికి చెందిన స్పందన సర్వీసెస్ సొసైటీ కార్యదర్శి చొప్పరి సోమయ్యను జిల్లా అత్యాచార నిరోధక కమిటీ సభ్యుడిగా వరంగల్ జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్స్, అగ్రికల్చర్ రీసెర్చ్ నిర్వాహకులు డాక్టర్ ఉమారెడ్డి నియమించారు. సోమయ్య మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి కమిటీ సభ్యుడిగా నియామకం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

### బీమా డబ్బుల అందజేత

నర్సంపేటరూరల్ : నర్సంపేట మండలం చంద్రయ్యపల్లి గ్రామంలోని చంద్ర పురుషుల పొదుపు సంఘం సభ్యుడు అజ్మీరా సారయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులకు బీమా డబ్బులు రూ.80 వేలు దుగ్గొండి పురుషుల సమితి అధ్యక్షుడు మహమ్మద్ ఉస్మాన్, సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్‌లు అందించారు. సంఘం ఉపాధ్యక్షుడు రమేష్, పాలకవర్గ సభ్యులు, గణకులు మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

### బీరన్న ఆలయ కమిటీ ఎన్నిక

నర్సంపేట రూరల్ : మండలంలోని గురిజాల గ్రామ బీరన్న దేవాలయ నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. అధ్యక్షుడిగా ఈర రాజ్‌కుమార్, డైరెక్టర్లుగా అల్లి అనీల్, బలుకా బాబు, కుమారస్వామి, కారు లక్ష్మీలను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు. కురుమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

### టీయూడబ్ల్యూజే ఐజేయూ ఈసీ మెంబర్‌గా రమేశ్

సంగెం : తెలంగాణ రాష్ట్ర యూనియన్ ఆఫ్ వర్కింగ్, ఇండియన్ జర్నలిస్టు యూనియన్ అనుబంధ వరంగల్ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా జ్యోతి రిపోర్టర్ పులి రమేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రమేష్‌ను తోటి జర్నలిస్టులు అభినందించారు.

### మూఢనమ్మకాలపై అప్రమత్తంగా ఉండాలి



పర్వతగిరి: మూఢనమ్మకాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక సీఐ రాజగోపాల్ అన్నారు. మండలంలోని కల్లెడలో బుధవారం రాత్రి పోలీస్ కళాజాత ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మద్యం, గుట్కా, పాన్ మసాలా, దురలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. గ్రామాలను మద్యం రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. ఎస్సై ప్రవీణ్, కళాజాత బృందం సభ్యులు పాల్గొన్నారు.

### కరెంట్ సమస్య లేకుండా చర్యలు

గీసుకొండ: వేసవిలో లోఓల్టేజీ, విద్యుత్ సరఫరాలో సమస్యలను తీర్చడానికి తమ సంస్థ కృషి చేస్తుందని ఎన్పీడీసీఎల్ ఏడీఈ బి. కిషోర్ అన్నారు. బుధవారం గ్రేటర్ వరంగల్‌లోని 16వ డివిజన్ ధర్మారంలో విద్యుత్ డిమాండ్ దృష్ట్యా 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి కొత్తగా 160 కేవీఏను ఏర్పాటు చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. దీంతో కరెంట్ సమస్యలు గ్రామంలో ఉండవని, విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే ఎన్పీడీసీఎల్ లక్ష్యం అని పేర్కొన్నారు. ఆయన వెంట ఏఈ దిలీప్‌కుమార్ ఉన్నారు.

### సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

నర్సంపేట : సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును చెన్నారావుపేట మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్, లింగాపురం గ్రామ మాజీ సర్పంచ్ తప్పెట రమేశ్ పంపిణీ చేశారు. మండలంలోని లింగాపురం కాంగ్రెస్ నాయకుడు రెడ్డబోయిన ఐలయ్య అనారోగ్యంతో హాస్పిటల్‌లో చికిత్స పొందగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో సీఎం సహాయనిధి నుంచి రూ.16వేలు మంజూరు కాగా బుధవారం బాధిత కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో గ్రామకాంగ్రెస్ అధ్యక్షుడు మచ్చిక కుమారస్వామి, మాజీ వైస్ ఎంపీపీ రాంబాబు, మాజీ సర్పంచ్ కుమారస్వామి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రమేష్, బీసీ సెల్ మాజీ మండల అధ్యక్షులు శివ, తదితరులు పాల్గొన్నారు.

### సైనిక్, గురుకులాల్లో సీట్లు సాధించిన విద్యార్థులు

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని అక్కల్‌చెడ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు సైనిక్, గురుకుల విద్యాలయాల్లో సీట్లు సాధించారు. ఐదో తరగతి చదువుతున్న పల్లకొండ యశ్వంత్‌రాజ్ రుక్మాపూర్ సైనిక్ స్కూల్, నాలుగో తరగతి చదువుతున్న ప్రణీత, మాధవి, శ్రీసుత తెలంగాణ గురుకులంలో సీట్లు సాధించారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

**మున్సిపాలిటీపై కాషాయ జెండా ఎగురవేయాలి**

నర్సంపేట : బీజేపీని బూత్ స్థాయిలో మరింత బలోపేతం చేస్తూ రానున్న ఎన్నికల్లో నర్సంపేట మున్సిపాలిటీపై కాషాయ జెండా ఎగురవేయాలని బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్, బీజేపీ ఆవిర్భావ కార్యక్రమ నర్సంపేట టౌన్ ఇన్‌చార్జ్ దుంకదువ్వ రంజిత్ అన్నారు. ఈ మేరకు నర్సంపేటలో పార్టీ పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్ అధ్యక్షతన బుధవారం బీజేపీ ఆవిర్భావ కార్యక్రమాలపై సమావేశం నిర్వహించారు.

**రైతులకు పరిహారం చెల్లించాలి**

నర్సంపేట రూరల్ : అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ మండల పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల రైతుల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు.

**గుడిసెవాసులకు కనీస సౌకర్యాలు కల్పించాలి**

నర్సంపేట : పట్టణంలోని వరంగల్ రోడ్డులోని సర్వే నంబర్ 813లో పేదలు వేసుకున్న గుడిసె వాసులకు కనీస మౌళిక సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ ఉద్యమ వేదిక రాష్ట్ర కన్వీనర్ సోమ రామ్మూర్తి, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి సోమిరెడ్డి శ్రీనివాస్, బీఎల్‌ఎఫ్ జిల్లా నాయకుడు నాగేశ్వర్, తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొజ్జ రాజన్న, విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి బట్టు సాంబయ్యలు డిమాండ్ చేశారు. పట్టణంలోని పాత తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో చేపట్టిన దీక్షలు బుధవారం 16వ రోజుకు చేరుకున్నాయి.

**తడిసిన పంటలను కొనుగోలు చేయాలి**

నర్సంపేట : వడగండ్ల వర్షంతో దెబ్బతిన్న మొక్కజొన్న, మిర్చి పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసి నష్టపోయిన రైతులను ఆదుకొని పరిహారం అందించాలని సీపీఎం చెన్నారావుపేట మండల నాయకుడు జన్ను రమేశ్ డిమాండ్ చేశారు. చెన్నారావుపేటలో మంగళవారం రాత్రి కురిసిన వడగండ్ల వర్షంతో తడిసిన మొక్కజొన్నలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ వడగళ్ల వర్షంతో మొక్కజొన్న, మిర్చి, వరి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, రైతులను ప్రభుత్వం ఆదుకొని వారికి తగిన నష్టపరిహారం చెల్లించాలన్నారు.


**ఘనంగా ఏక్ భారత్ శ్రేష్ఠ్ భారత్**

వర్ధన్నపేట : స్థానిక జెడ్పీఎస్ఎస్‌లో ఏక్ భారత్ శ్రేష్ఠ్ భారత్ కార్యక్రమాన్ని ఎన్‌సీసీ అధికారి మనుజేందర్ రెడ్డి బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థులు హర్యానా బాషా, వేషధారణతో ప్రేక్షకులను అలరించారు. అదే విదంగా హర్యానా రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా నృత్య ప్రదర్శనలు, ఆహార పదార్థాల వంటకాలను ప్రదర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ శ్రీధర్ అన్నారు. బుధవారం ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన వార్షికోత్సవ వేడుకల కార్యక్రమానికి ఎంఈఓ శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

**మాదిగ జేఏసీ నూతన కమిటీలు ఎన్నిక**

నర్సంపేట : మాదిగ జేఏసీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నర్మెట్ట యాదగిరి, కార్యదర్శి తీగల అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో చెన్నారావుపేట మండలంలోని ఖాదర్‌పేట, చెన్నారావుపేట ఎస్సీ కాలనీల మాదిగ జేఏసీ కమిటీలను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఖాదర్‌పేట అధ్యక్షుడిగా తుమ్మలపల్లి అనిల్, ప్రధాన కార్యదర్శిగా కేశపాక యాకూబ్, ఎన్నికయ్యారు. చెన్నారావుపేట ఎస్సీ కాలనీ అధ్యక్షుడిగా జంగిలి శ్రీనివాస్, ప్రధానకార్యదర్శిగా బారపాక నవీన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

**అవమానించిన వారిపై చర్య తీసుకోవాలి**



వర్ధన్నపేట : మాజీ ఎమ్మెల్యే, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్‌కు పట్టణ కేంద్రంలోని రామాలయంలో అవమానం జరిగింది. దీనికి కారకులైన బాధ్యులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ బిర్రు మహేందర్ మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ సెంటర్ వద్ద బాబు జగ్జీవన్‌రామ్, అంబేద్కర్ ఉత్సవాల జయంతి కమిటీని అన్ని కులసంఘాలతో కలుపుకుని ఏర్పాటు చేశారు. చైర్మన్‌గా మరుపట్ల అంజయ్య, వైస్ చైర్మన్‌లుగా తుమ్మల కుమార్, ఎర్ర సంతోష్, జనగాం చంద్రమౌళి, ఎం.మల్లేష్, టీ అనిల్, సీహెచ్.రాజా, భిక్షపతి, పెద్దకుమార్, సీహెచ్ కరుణాకర్లను నియమించారు.

## సంక్షిప్త సమాచారం

**మహిళలు అన్ని రంగాల్లో రాణించవచ్చు**

నర్సంపేట : సాధనతో మహిళలు అన్ని రంగాల్లో రాణించవచ్చని విజడమ్ హైస్కూల్ డైరెక్టర్ జావేద్ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పుస్తక మిత్ర(షిరోస్), లీడ్ లైబ్రరీ ఆధ్వర్యంలో హైస్కూల్‌లో బాలికలచే అనేక రంగాల్లో విశిష్ట సేవలు అందించి, స్త్రీలు అన్నింటా ఘనులని చాటిచెప్పిన ఎందరో త్యాగధనులైన తమ తమ రంగాల్లో ఖ్యాతి గడించిన స్త్రీ మూర్తుల ఏకపాత్రాభినయాలతో 50 మంది విద్యార్థినిలు తమ పాత్రకు తగ్గ వేషధారణాలు వేశారు.

**పంట దగ్ధానికి తమకు సంబంధం లేదు**

నల్లబెల్లి : మండల కేంద్రానికి చెందిన మూటికె వీరన్న-కమలమ్మ దంపతులకు చెందిన రెండు ఎకరాల్లోని మొక్కజొన్న పంట దగ్ధం కావడానికి తమకు ఎలాంటి సంబంధంలేని నల్లబెల్లికి చెందిన పిండి రవి, కట్టయ్య, శ్రీనివాస్‌లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

**కార్మికుల సమస్యలు పరిష్కరించాలి**

ఖానాపురం: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు ఉస్మాన్‌పాషా డిమాండ్ చేశారు. ఈ మేరకు సమస్యల పరిష్కారానికి చేపట్టే సమ్మె నోటీసును బుధవారం ఎంపీడీఓ సునీల్‌కుమార్‌కు అందజేశారు.

**నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలి**

నల్లబెల్లి : నర్సంపేట నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కొండాపూర్ సబ్‌స్టేషన్ పనులు ప్రారంభించడానికి 16 నెలలు కాలయాపన చేయడం సరికాదన్నారు. హార్టికల్చర్ పరిశోధన కేంద్రం పనులు వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**ఉపాధ్యాయులకు ఓడీ సర్టిఫికెట్లు ఇప్పించాలి**

పర్వతగిరి: సమగ్ర ఇంటింటి సర్వే చేసిన ఉపాధ్యాయులకు ఓడీ సర్టిఫికెట్లు ఇప్పించాలని డీటీఎఫ్ మండల అధ్యక్షుడు రామస్వామి అన్నా రు. డీటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో బుధవా రం ఎంపీడీఓ శంకర్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు.

**ముదిరాజ్‌ల ఐక్యతకు కృషి చేయాలి**

నర్సంపేట రూరల్ : గ్రామ గ్రామాన ముదిరాజ్‌ల ఐక్యతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ అన్నారు. మండలంలోని ఇటుకాలపల్లిలో మెపాలో ముదిరాజ్ యువతకు ప్రాధాన్యంపై ముఖాముఖి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించా రు. ఆయన మాట్లాడుతూ డివిజన్, అన్ని మండలాలు, గ్రామాల్లో ముదిరాజ్ యువతకు ప్రాధాన్యత ఇవ్వడమే లక్ష్యమన్నారు.

**రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేయాలి**

సంగెం : రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ పరకాల కోఆర్డినేటర్ కూచన రవళి పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని చింతలపల్లి, కృష్ణానగర్‌లో జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా పాదయాత్ర నిర్వహించారు.


**ఒకరిపై కేసు నమోదు**

నర్సంపేట రూరల్ : మద్యం సేవించి పోలీస్ సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గూడ అరుణ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పట్టణంలోని బుధవారం రాత్రి పాకాల రోడ్డుకు వెళ్లే దారిలోని భద్రకాళి చికెన్ సెంటర్ వద్ద రెండు కార్లు ఢీకొని ప్రమాదం జరిగిందని సమాచారం మేరకు పెట్రోలింగ్ సిబ్బంది అక్కడికి చేరుకోని విచారిస్తున్నారు. బొబ్బాల పృథ్వీరాజ్ మద్యం సేవించి సిబ్బందిని తిడుతూ విధులకు ఆటంకం కలిగించాడన్నారు. సిబ్బంది ఫిర్యాదు మేరకు అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

**వరుసగా వీస్తున్న ఈదురుగాలులు**

దుగ్గొండి : మండలంలోని పలు గ్రామాల్లో వరుసగా రెండో రోజు మంగళవారం రాత్రి భారీ ఈదురు గాలులు వీచాయి. మండల వ్యాప్తంగా 1200 ఎకరాల్లో మొక్కజొన్న పంట నష్టపోయినట్లు అధికారులు అంచనా వేశారు.

**సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం**



దుగ్గొండి: డ్వాక్రా స్వయం సహాయక సంఘాలకు జీరో వడ్డీ రుణాల బకాయిలను ప్రభుత్వం ఇటీవల విడుదల చేసింది. అట్టి డబ్బులు సంఘాల ఖాతాలలో జమ అయ్యాయి. ఈమేరకు మహిళలు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మాధవరెడ్డి చిత్రపటాలకు గిర్నిబావిలో బుధవారం క్షీరాభిషేకం చేశారు.

**ఘనంగా ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ వేడుకలు**

నర్సంపేట/నల్లబెల్లి: నర్సంపేటలో, నల్లబెల్లిలోని పార్టీ కార్యా లయంలోఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు భేతి భరత్ ఆధ్వర్యంలో బుధవారం ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు జయ్యారపు అఖిల్, తిరుపతిరెడ్డిలు హాజరై కేక్ కట్ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

**బాధిత కుటుంబానికి పరామర్శ**

పర్వతగిరి : వరంగల్ ఏఎంసీ మాజీ చైర్మన్ తక్కళ్లపల్లి నారాయణరావు తల్లి సుభద్రదేవి ఇటీవల మృతి చెందింది. ఏనుగల్‌లో బుధవారం నిర్వహించిన దశదిన కార్యక్రమానికి ఎమ్మెల్సీ ఎల్.రమణ హాజరై మృతురాలి చిత్రపటం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. ఆయన వెంట మాజీ మంత్రి దయాకర్‌రావు, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. రాజు యాదవ్ (S.R) : 9502950309 (వర్ధన్నపేట)
కె. రమేష్ (S.R) : 9441304664 (నర్సంపేట)
పి.చంద్రశేఖర్ (A.C.O) : 9963646944